ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 14 అక్టోబరు 2024





వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో లాటరీ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

దసపల్లా భూములపై ప్రభుత్వం ఆరా!

- ఇప్పటివరకు ఏం జరిగిందో నివేదించండి
- వివరాలు సిద్ధం చేస్తున్న యంత్రాంగం



దసపల్లా భూములు


విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):

వేల కోట్ల విలువైన దసపల్లా భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ భూములు నిషేధిత జాబితా 22-ఏ నుంచి తొలగింపు ప్రక్రియ మొదలుకొని అక్కడ బహుళ అంతస్తుల నిర్మాణానికి జరిగిన ఒప్పందంలో గూడుపుఠాణిపై నిగ్గుతేల్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైసీపీ పెద్దలకు భారీ లాభం చేకూరేలా ఈ వ్యవహారంలో ఏం జరిగిందో నివేదించాలని ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం వివరాల సేకరణలో నిమగ్నమైంది.

గత ప్రభుత్వ హయాంలో కీలక పెద్దల ప్రమేయంతో నగరంలో అత్యంత ఖరీదైన భూములు చేతులుమారాయి. మరిన్ని బలవంతంగా దోచుకోగా, అందులో దసపల్లా భూముల వ్యవహారం ఒకటి. భీమిలి మండలం కొత్తవలసలో 15 ఎకరాలను శారదాపీఠాధిపతికి ఎకరా రూ. లక్షకు కట్టబెట్టడంపై ఇప్పటికే ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదిక పంపింది. ఎండాడలో హయగ్రీవ డెవలపర్స్ భూముల వ్యవహారం, నిర్మాణాలపై తాజాగా స్థితిని తెలియజేస్తూ వివరాలు పంపారు. ఇప్పుడు దసపల్లా భూములపై వాస్తవ పరిస్థితులు తెలియజేసేలా సమగ్ర నివేదిక పంపాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మరిన్ని భూ వ్యవహారాలపై పాలకులు దృష్టిసారించారని స్పష్టమైంది. చినవాల్తేరు సర్వే నంబరు 1027, 1028, 1196, 1197లో 60 ఎకరాల్లో ప్రభుత్వ అవసరాలకు పోగా మిగిలిన 15 ఎకరాల్లో ఉన్న దసపల్లా భూములు కాపాడుకునేందుకు గతంలో ప్రభుత్వ అధికారులు సమర్థంగా వ్యవహరించలేదు. ఈ నేపథ్యంలో దసపల్లా భూములకు 2014లో అప్పటి కలెక్టర్ యువరాజ్ నిషేధిత జాబితా 22-ఏలో చేర్చారు. 2023 వరకు భూములు అలాగే ఉన్నాయి. ఈ భూములపై కన్నేసిన వైసీపీ పెద్దల ఒత్తిడితో గత కలెక్టర్ 22-ఏ నుంచి తప్పించారు. దీంతో అక్కడ ఆకాశహర్మ్యాలు నిర్మించాలని కీలకనేత తన కుమార్తెకు చెందిన కంపెనీకే డెవలప్‌మెంట్ బాధ్యతలు అప్పగించారు. డెవలప్‌మెంట్‌లో ... మిగతా 6వ పేజీలో

వైభవంగా శమీ పూజ





విజయదశమి పురస్కరించుకుని సింహాచలం కొండదిగువ పూతోటలో ఆదివారం శమీ పూజను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి శ్రీరాముడి అలంకారంలో పూల తోటకు చేరుకుని, భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు దేవతా వృక్షం జమ్మి చెట్టుకు పూజలు జరిపి, జమ్మివేట నిర్వహించారు. అనంతరం స్వామి అశ్వవాహనంపై సింహాచలం ప్రధాన పురవీధుల్లో విహరించారు.

శమీపూజ నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. (ఇన్‌సెట్) స్వామివారు

- వివరాలు I పేజీలో

లాటరీకి వేళాయె!

జిల్లాలో 155 మద్యం దుకాణాలు

- మొత్తం అందిన దరఖాస్తులు 4,139
- నేడు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లాటరీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం 8 గంటలకే మొదటి దుకాణం కేటాయింపు



లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు ఎక్సైజ్‌శాఖ అధికారులు సోమవారం లాటరీ నిర్వహించనున్నారు. ఇందు కోసం సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 155 మద్యం దుకాణాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయగా మొత్తం 4,139 దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్ సమక్షంలో ఒక్కో దుకాణానికి లాటరీ తీసి, ఎంపికైనవారికి రెండేళ్ల పాటు నిర్వహించుకునేందుకు వీలుగా దుకాణం లైసెన్సును కేటాయించనున్నారు.

మద్యం దుకాణాల కేటాయింపునకు వీలుగా తీయనున్న లాటరీకి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దరఖాస్తుదారులు వేచివుండడానికి వీలుగా సదుపాయలను కల్పిస్తున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకే దరఖాస్తుదారులంతా గురజాడ కళాక్షేత్రం వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎంట్రీపాసుల స్కానింగ్, దరఖాస్తు ఫారాలను పరిశీలించిన తర్వాత మొదటి మూడు దుకాణాలకు దరఖాస్తు చేసినవారిని అక్కడి నుంచి లాటరీ తీసే వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్‌ఎరీనా లోపలకు పంపిస్తారు. తర్వాత మూడు దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నవారిని థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద వేసిన టెంట్‌లో కూర్చోబెడతారు. ఇలా ఒక బ్యాచ్ తర్వాత మరో బ్యాచ్‌ను లోపలకు పంపిస్తారు. ఒక దుకాణానికి దరఖాస్తు చేసుకున్నవారందరికీ వారి దరఖాస్తు సీరియల్ నంబరు ప్రకారం టోకెన్‌లు ఇస్తారు. దరఖాస్తుదారులు వాటిని ఒక డబ్బాలో వేస్తే, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో టోకెన్‌లను బాగా కలిపి ఒకటి తీస్తారు. ఆ టోకెన్ నంబరు కలిగిన దరఖాస్తుదారుడికి దుకాణం ... మిగతా 6వ పేజీలో

వైసీపీ సేవలోనే జీవీఎంసీ ఇంజనీర్లు

ఎర్రిగెడ్డలో పూడికతీత టెండరుపై ఆరోపణలు

- ఏడునెలలు చేపట్టాల్సిన పనులకు రూ.80.36 లక్షలతో షార్ట్ టెండర్
- గతంలో లేని విధంగా అడ్డగోలుగా నిబంధనల రూపకల్పన
- పాత కాంట్రాక్టర్‌కు పనులు కట్టబెట్టేందుకు వ్యూహం
- ప్రభుత్వం మారినా స్వామి భక్తిని చాటుకుంటున్న అధికారులు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లు



ఎర్రిగెడ్డలోకి కొట్టుకు వచ్చిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా వైసీపీ సేవలో తరించిన అధికారుల్లో మార్పు రావడం లేదు. వారికి అనుకూలంగా పనులు చేసిపెట్టడంలోనే తరిస్తున్నారు. తాజాగా జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలోని కొంతమంది అధికారుల వైసీపీ స్వామి భక్తి వెలుగులోకి వచ్చింది. జీవీఎంసీ పరిధిలో చేపట్టే వివిధ పనులకు సంబంధించి వైసీపీ నేతల ఆదేశాలకు అనుగుణంగా టెండరు నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఎర్రిగెడ్డలో ఏడునెలల పూడికతీతకు షార్ట్ టెండర్ పిలిచిన అధికారులు, వైసీపీ నేత బంధువుకు కాంట్రాక్టుదక్కేలా అడ్డగోలు నిబంధనలు విధించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలోని మురళీనగర్, మాధవధార, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం, రైల్వేన్యూకాలనీ, అల్లిపురం, వన్‌టౌన్ ప్రాంతాల నుంచి మురుగునీరు ఎర్రిగెడ్డ ద్వారా పోర్టువద్ద (ఆర్‌ఎండీ) సముద్రంలో కలుస్తుంది. ఎర్రిగెడ్డలో మురుగునీటితోపాటు ప్లాస్టిక్, చెట్లు, ఇతర వ్యర్థాలు ... మిగతా 6వ పేజీలో

సెర్చ్ షురూ..!



- ఏయూ వీసీ నియామక ప్రక్రియను వేగవంతం చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తాజాగా సెర్చ్ కమిటీ ఏర్పాటుకు అడుగులు
- నామినీ పేరును సూచించాలని వర్సిటీ అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి వైస్ చాన్సలర్లను నియమించాలని భావించిన ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో విజయం తరువాత రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం విశ్వ విద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్లను నియమించింది. ఈ నియామకంలో కొన్నిచోట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో వారంతా ఇన్‌చార్జిలేనని, కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయి వైస్ చాన్సలర్లను నియమిస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం ఈ ప్రక్రియను జోరుగా ముందుకు తీసుకువెళ్తోంది. ఇందులో భాగంగా గత నెలలో పూర్తిస్థాయి వీసీల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యాశాఖ నెలాఖరు వరకు దరఖాస్తులను స్వీకరించింది. ఈ ప్రక్రియ ముగియడంతో తదుపరి దశను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఈ క్రమంలోనే సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేయనుంది. అందుకు అనుగుణంగా ఏయూ అధికారులకు కీలక ఆదేశాలందాయి. ఏయూ వీసీ నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీ ఏర్పాటుకు వర్సిటీ నామినీ పేరును సిఫార్సు చేయాల్సిందిగా ఉన్నత విద్యాశాఖ వర్సిటీ అధికారులకు సర్క్యులర్‌ను జారీచేసింది. ఈ నెల 25లోగా నామినీ పేరును పంపించాలని అందులో పేర్కొంది. దీనిపై వర్సిటీ అధికారులు ప్రస్తుతం మల్లగుల్లాలు పడుతున్నారు. ఇందుకోసం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాన్ని అత్యవసరంగా నిర్వహించాల్సి ఉంది. ముందుగా అనుకున్న ప్రకారం ఈ నెల తొమ్మిదో తేదీన సమావేశాన్ని నిర్వహించాలి. అనివార్య కారణాలు వల్ల వాయిదా పడింది. సాధారణంగా రెండు, మూడు వారాల తరువాత నిర్వహించినా ఇబ్బంది ఉండదు. కానీ ఏయూ నుంచి సెర్చ్ కమిటీ సభ్యుడి నియామకానికి సంబంధించిన నామినీ పేరును సిఫార్సు చేయాల్సి ఉండడంతో రెండు, మూడు రోజుల్లోనే ఈసీ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. ఏయూ నుంచి నామినీగా మాజీ వీసీని నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నామినీగా మాజీ వీసీల్లో ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఏయూ మాజీ వీసీల్లో ప్రస్తుతం ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు, ప్రొఫెసర్ బీల సత్యనారాయణ ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరి పేరును సిఫార్సు చేస్తారని చెబుతున్నారు. సెర్చ్ కమిటీలో వర్సిటీ నామినీతోపాటు గవర్నర్ నామినీ (ప్రభుత్వమే సిఫార్సు చేయవచ్చు), యూజీసీ నామినీ ఉంటారు. ఈ ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తుంది. వారిలో ఒకరిని గవర్నర్ ఎంపిక చేసి, వైస్ చాన్సలర్‌గా నియమిస్తారు.

తీరానికి పోటెత్తిన జనం



దసరా పండగ, సెలవులు కావడంతో శని, ఆదివారాల్లో జనం తీరానికి పోటెత్తారు. కుటుంబాలతో సహా బీచ్‌లకు చేరుకుని సందడి చేశారు. కొంతమంది సముద్ర స్నానాలతో సరదాగా గడపగా, మరి కొంతమంది తీరంలోని ఆలయాలను సందర్శించి ఇసుక తిన్నెల్లో ఆటలాడారు.
- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

నగరానికి దసరా కిక్కు

- ఒక్కరోజులో రూ.13 కోట్ల మద్యం విక్రయం
- రూ.పది కోట్ల మేర మాంసం అమ్మకాలు
- గత ఏడాదికంటే ఐదు శాతం పెరుగుదల
- సందడిగా ముగిసిన పండగ



గోపాలపట్నంలో మాంసం దుకాణాల వద్ద రద్దీ



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో మద్యం దుకాణం వద్ద జనం

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

దసరా పండగను నగరవాసులు మందు...ముక్కతో మజా చేసుకున్నారు. ఈ ఏడాది దసరా శనివారం కావడంతో మాంసాహారానికి ప్రజలు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో ఆదివారం మద్యం, మాంసాహారంతో అసలైన పండగను జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే చికెన్, మటన్ దుకాణాల ఎదుట ప్రజలు బారులు తీరారు. మద్యం ప్రియులంతా ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు బార్‌లకు పరుగు పెట్టారు.

జిల్లాలో 139 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 132 బార్‌లు వున్నాయి. వీటికి ఆనందపురం, గాజువాకలోని ఐఎంఎల్ డిపోల ద్వారా మద్యం సరఫరా జరుగుతుంది. నగరంతోపాటు తగరపువలస, భీమిలి ప్రాంతాల్లోని దుకాణాలకు డిపో-1 ద్వారా, పెందుర్తి సర్కిల్‌తోపాటు గాజువాక ప్రాంతాల్లోని దుకాణాలకు గాజువాకలోని డిపో-2 ద్వారా మద్యం సరఫరా చేస్తారు. దసరా సందర్భంగా రెండు డిపోల ద్వారా సుమారు 5,500 కేసుల మద్యం, 4వేల కేసుల బీరు అమ్ముడైనట్టు ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ రోజుల్లో సగటున రూ.పది కోట్లు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. కానీ దసరా నేపథ్యంలో రూ.13 కోట్లు విక్రయాలు జరిగాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది విక్రయాలతో పోల్చితే ... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు



రఘువర్మ



గాదె శ్రీనివాసులనాయుడు

- ఫిబ్రవరి లేదా మార్చిలో నిర్వహించే యోచన
- మరోసారి పోటీలో సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ
- బరిలో మాజీ ఎమ్మెల్సీ గాదె, విశ్రాంత ఆర్‌ఐవో
- సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించిన మరికొందరు
- నవంబరు 6 వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ప్రారంభమయింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 6వ తేదీ వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీకాలం ... మిగతా 6వ పేజీలో

రైతుబజార్ వెలవెల



పండగ వేళ సీతమ్మధార రైతుబజారు ఇలా...

సీతమ్మధార, అక్టోబరు 13: నగరంలో అతి పెద్ద రైతుబజార్లలో ఒకటైన సీతమ్మధారలో రైతులు కానరాక, బజార్‌లో కూరగాయలు లేక ఆదివారం బోసిపోయింది. దసరా పండుగ సందర్భంగా రైతులు ఇళ్ల వద్ద పండుగ చేసుకోవడంతో చాలా మంది బజారుకు రాలేదు. కొద్దిమంది వచ్చినా తక్కువగా తెచ్చిన కూరగాయలు విక్రయించి తొందరగా ఇళ్లకు వెళ్లిపోయారు. కొనుగోలుదారులు సైతం పెద్దగా రాకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బక్క నారాయణరావు (ఫైల్ ఫొటో)

మర్రిపాలెం, అక్టోబరు 13: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మర్రిపాలెం సాయినగర్‌లో ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో గోవుల సంరక్షణ బాధ్యతను పార్వతీపురం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన బక్క నారాయణరావు గత నెల 27 నుంచి చూస్తున్నాడు. అయితే ఈ నెల 2న బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి రాకపోవడంతో పలువురిని వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో శానాపతి ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఈ వ్యక్తి ఆచూకీ కనుగొంటే ఈ ఫోన్ 94403 59124 నంబరులో తెలియజేయాలని కోరారు.

కోటవీధి వాసుల కల ఫలిస్తున్న వేళ..

» ఫెర్రీ మురుగు కాలువ సమస్యకు చెక్ » బ్రిడ్జి నిర్మాణానికి పోర్టు అథారిటీ చర్యలు

జగదాంబ కూడలి, అక్టోబరు 13: వన్‌టౌన్ కోటవీధి నివాసీయుల వెతలు తీరే రోజులు సమీపించాయి. అలవి కాని సమస్యలతో అల్లాడిపోయిన వీరికి కాస్త సాంత్వన లభించింది. ఇంతకాలం పోర్టు కాలుష్యం, ఫెర్రీ రోడ్డు వద్ద మురుగు నీటి సమస్యతో జీవనం సాగించాల్సిన దుస్థితి వీరిది. పోర్టు అథారిటీ తక్షణం ఫెర్రీ రోడ్డులో మురుగు నీటికి చెక్ పెట్టేలా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలంటూ కోట వీధి ప్రాంతానికి చెందిన ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనేక పోరాటాలు చేశారు. అయినా సరే పోర్టు యాజమాన్యం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏనాడూ స్పందించలేదు. ఫెర్రీ రోడ్డులో నివాసీయులు, కోట ప్రాంతవాసులు ఫెర్రీ రోడ్డు వద్ద మురుగు నీటితో నిత్యం యాతన పడేవారు. వర్షకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఎన్నికల సమయంలో కూటమి తరఫున బరిలో నిలిచిన పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్, దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణలు ప్రత్యేకంగా ఫెర్రీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగేలా పోర్టు యాజమాన్యంతో మాట్లాడతామని హామీ ఇచ్చి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫెర్రీ రోడ్డు పరిస్థితిలో మార్పు రాకపోవడంతో కోటవీధి ప్రాంతీయులు, 39వ వార్డు ప్రజానీకం టీడీపీ కూటమి అభ్యర్థుల వైపు మొగ్గారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఫెర్రీ రోడ్డు మురుగు నీటి దుస్థితి నివారణకు చర్యలు చేపట్టారు. పోర్టు యాజమాన్యంతో ఎంపీ భరత్ పలుమార్లు చర్చలు జరిపి ఫెర్రీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఒప్పించారు. దీంతో రెండు నెలలుగా ఫెర్రీరోడ్డు వద్ద పోర్టు యాజమాన్యం బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతోంది. కొన్నేళ్లుగా ఫెర్రీ రోడ్డు నివాసీయులు పడుతున్న ఇబ్బందులు తొలగుతుండడం, మురుగు నీటి నిల్వలు లేని గెడ్డలు కనిపిస్తుండడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఎన్నో పోరాటాల తరువాత బ్రిడ్జి నిర్మాణ పనులు జోరుగా సాగడం పట్ల ముస్లిం వర్గాలు, స్థానిక ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



పోర్టు అథారిటీ నిర్మిస్తున్న ఫెర్రీ రోడ్డు బ్రిడ్జి

వీనుల విందుగా దసరా సంగీత మహోత్సవం

» మోరుమోగిన ప్రముఖుల సంకీర్తనలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 13: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత మహోత్సవం ఆహూతులకు వీనుల విందు చేసింది. డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం వ్యవస్థాపకులు ఆకొండి వెంకట్రావు సారథ్యంలో 12 గంటల పాటు నిర్విరామంగా ఇక్కడి విద్యార్థులు మృదు మధురంగా సంకీర్తనగానం నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి మఠంలో ఆ కొండి వెంకట్రావు, ఆయన శిష్య బృందం, గాయనీ గాయకులంతా త్యాగరాజస్వామి, అన్నమాచార్య, పురందరదాసు సంకీర్తనలు, భజనలు గానం చేశారు. కళా ప్రాంగణం సంకీర్తనలతో మోరుమోగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రఘురామారావు, శాంతి దంపతులు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సంస్థ ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.మధుబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

23న నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట, అక్టోబరు 13: ఈ నెల 23న ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బీ శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులు ఒక్కొక్కటి, అయిదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న ఉపసంహరణకు గడువని తెలిపారు. 23న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని క్లాక్ రూమ్ వద్ద ఎన్నికలు నిర్వహించిన అనంతరం అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

దసపల్లా భూములపై ప్రభుత్వం ఆరా!

... 5వ పేజీ తరువాయి

భూ యజమానులకు కేవలం 30 శాతం, ప్రభుత్వ పెద్దలు, నిర్మాణ సంస్థకు 70 శాతం వాటా తీసుకున్నారు. ఇక్కడ 75,939 చదరపు గజాల స్థలంలో 27.55 లక్షల చదరపు అడుగుల నివాస, వాణిజ్య భవనాలు నిర్మిస్తామని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో అనేక సెటిల్‌మెంట్లకు పాల్పడిన, యూఎల్‌సీ కింగ్‌గా పేరొందిన వ్యక్తి ఇందులో భారీగా లబ్ధి పొందారు. అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్‌లో అప్పటి సబ్ రిజిస్ట్రార్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దసపల్లా భూముల వ్యవహారంలో వేలకోట్ల లావాదేవీలపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి విపక్ష టీడీపీ, జనసేన నేతలు వేర్వేరుగా పోరాటాలు చేశారు. కూటమి అధికారం చేపట్టిన తరువాత గత నెలలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా దసపల్లా భూములను సందర్శించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దర్బార్‌లో ఈ భూములపై కొంతమంది ఆయనకు ఫిర్యాదుచేశారు. విశాఖలో భూముల దోచుకున్న వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేయాలనే ఆలోచనతో దసపల్లా భూములపై ప్రభుత్వం నివేదిక కోరింది. దీంతో ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలపై జిల్లా యంత్రాంగం నివేదిక సిద్ధంచేసి పంపనున్నది.

లాటరీకి వేళాయె!

... 5వ పేజీ తరువాయి

కేటాయిస్తారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి ఒకవేళ అనుకున్న సమయానికి నిర్దేశించిన లైసెన్స్‌ఫీజు వాయిదా చెల్లించలేని పక్షంలో తర్వాత మరొకరికి అవకాశం ఇచ్చేందుకు వీలుగా మరో ఇద్దరిని ఎంపిక చేసి, స్టాండ్‌బైగా ఉంచుతారు. ఇలా 155 దుకాణాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా లాటరీ తీసే ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఉదయం ఎనిమిది గంటలకు గెజిట్ నంబరు ఒకటి దుకాణానికి లాటరీ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ కోసం అధికారులు ఏర్పాట్లుపూర్తిచేశారు. లాటరీ సందర్భంగా ఎవరు ఏయే విధులు నిర్వర్తించాలనే దానిపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు

... 5వ పేజీ తరువాయి

వచ్చే ఏడాది మార్చితో ముగియనున్నది. మరోసారి ఆయన పోటీకి సిద్ధపడుతుండగా, మరికొంతమంది ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ పర్యాయం పోటీచేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, రిటైర్డు అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏపీటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేస్తారని ఆ సంఘం ఇప్పటికే ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా బరిలో ఉంటానని వెల్లడించారు. తమ సంఘం నుంచి అభ్యర్థిని ఖరారు చేసేందుకు వీలుగా ఈనెల 15వ తేదీన యూటీఎఫ్ సమావేశం నిర్వహించనున్నది. మిగిలిన ప్రధాన సంఘాలు బరిలో నిలవాలా లేక భావ సారూప్యత కలిగిన సంఘాలతో కలిసి పోటీచేయాలా? అన్నదానిపై ఇంకా నిర్ణయానికి రాలేదు. విశాఖ ఇంటర్‌బోర్డులో ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేసి, ఈ ఏడాది జనవరిలో రిటైరైన ఆర్.సత్యనారాయణ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యాపకులకు వాట్సాప్ మేసేజ్‌లు పంపడమేకాకుండా స్వయంగా కలుస్తున్నారు. ఆనందపురం ఎంఈవోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పద్మావతి ఎమ్మెల్సీగా పోటీచేయాలని సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదిలావుండగా నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఎమ్మెల్సీగా పోటీచేయాలని నిర్ణయించి ఇప్పటికే పలువురు ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లను కలిశారు. రాయలసీమకు చెందిన వైసీపీ సానుభూతిపరుడైన ఎమ్మెల్సీ మద్దతుతో బరిలో నిలవాలని ఆయన నిర్ణయించారు. వచ్చే నెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించనున్నందున అప్పటికి ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వస్తుందని సంఘనేతలు చెబుతున్నారు.

నగరానికి దసరా కిక్కు

... 5వ పేజీ తరువాయి

ఈ ఏడాది స్వల్పంగానే పెరిగాయని, దీనికి కారణం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పెద్దగా స్టాకు లేకపోవడమేనని చెబుతున్నారు. ప్రభుత్వ దుకాణాలను మరో రెండు రోజుల్లో మూసేస్తుండడంతో సరకు సరఫరాపై నియంత్రణ, ప్రీమియం బ్రాండ్‌లు లేకపోవడంతో మందుబాబులంతా బార్‌లకు పోటెత్తారని చెబుతున్నారు. బార్లలో కౌంటర్ సేల్స్‌కు డిమాండ్ పెరిగిందని అభిప్రాయపడుతున్నారు.

రూ. 10 కోట్ల మాంసం తినేశారు

దసరా శనివారం కావడంతో మాంసం విక్రయాలపై తీవ్రప్రభావం పడింది. పండగ సందర్భంగా వాహనాలు, మార్కెట్లు, దుకాణాలు, పరిశ్రమల వద్ద మొక్కుబడిగా మేక/గొర్రెపోతులను బలిస్తుంటారు. ఆ మాంసాన్ని అసోషియేషన్ల సభ్యులు, కళాసీలు, కార్మికులకు పంచిపెడుతుంటారు. కానీ శనివారం కావడంతో జంతుబలి లేకుండానే పూజలు పూర్తిచేసి, ఆదివారం మజాను ఆస్వాదించారు. జిల్లాలో సుమారు 600 వరకూ మటన్ దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ సగటున ఐదు మేకలు/గొర్రెపోతులు విక్రయిస్తుంటారు. దసరా సందర్భంగా రెట్టింపు సంఖ్యలో విక్రయాలు జరిగినట్టు వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఒక్కోమేక/గొర్రెపోతు సగటున 10 కిలోలు ఉంటుందనుకుంటే ఒక్కో దుకాణంలో వంద కిలోల చొప్పున ఆరు వేల కిలోల మటన్ అమ్ముడైంది. మటన్ కేజీ రూ.వెయ్యి కావడంతో రూ.ఆరు కోట్లు విక్రయాలు సాగాయి. ఇది కాకుండా మొక్కుబడుల పేరుతో జిల్లా వ్యాప్తంగా సుమారు మరో 500 వరకూ మేక/గొర్రెపోతులను బలి ఇచ్చారు. దీంతో మరో ఐదు వేల కిలోల మటన్ పంపిణీ జరిగిందని భావిస్తే ఇది రూ.ఐదు కోట్లు వరకూ ఉంటుంది. అన్నింటినీ కలిపితే రూ.పది కోట్లకు పైగా మటన్ విక్రయాలు జరిగివుంటాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దసరా రోజున చికెన్‌కు డిమాండ్ తక్కువగా ఉంటుంది కాబట్టి వాటి విక్రయాలను వ్యాపారులు పరిగణనలోకి తీసుకోలేదు.



మాధవధారలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న దుర్గాదేవి



కళింగనగర్‌లో అనుపు ఉత్సవంలో జన నీరాజనాలు

ఉత్సాహంగా దుర్గమ్మ నిమజ్జన సంబరం

మురళీనగర్, అక్టోబరు 13: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఈ ఏడాది అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు జరిగాయి. మునుపెన్నడూ లేని విధంగా జనం సంబరాలు చేసుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో స్వామి శనివారం విశిష్ట వజ్ర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మురళీనగర్ హైస్కూలు సమీపంలోని రామాలయం వద్ద లలితాదేవి సన్నిధిలో ఆదివారం భక్తులకు సామూహిక అన్నదానం జరిపారు. 51వవార్డు సీతన్నగార్డెన్స్ కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగించి, భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. 49వ వార్డు కంచరపాలెం బర్మాక్యాంప్ శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో కొలువుదీర్చిన దేవీ ప్రతిమ అమ్మవారి అనుపు ఉత్సవం జరిపారు. కాలనీల్లో భారీ ఎత్తున పూజా మండపాల నుంచి దేవి ప్రతిమలు సాగర నిమజ్జనానికి తరలించారు. ధూప దీప నైవేద్యాల మధ్య సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు, భక్తుల కోలాహలంతో నిమజ్జన కార్యక్రమం జరిపారు. మరో వైపు శనివారం కొన్నిచోట్ల దేవీ విగ్రహాల్ని ప్రతిష్ఠించి వేడుకలు ఈ నెల 21 వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ శివరామకృష్ణ దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇక్కడి అమ్మవారు ఉమాదేవిని చివరిరోజు రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భార్గవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, శమీవృక్ష పూజ, చండీ హోమం జరిపి పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు, మంత్రపుష్పాలు సమర్పించి దివ్య మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, మన్మథరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు

సీతమ్మధార: సీతమ్మదార పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల క్రీడాభారతి ఆధ్వర్యంలో షైక్ బాక్సింగ్ క్లబ్ సభ్యులు దసరా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి క్రీడా భారతి అధ్యక్షులు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దుర్గాదేవి పూజా మహోత్సవాన్ని నిర్వహించి క్రీడాకారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులంతా ఆటల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ధినిష్, చిత్ర ఆనంద్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోరుగా నాటుకోళ్ల విక్రయం



పూర్ణామార్కెట్‌లో నాటుకోళ్ల వ్యాపారి

పూర్ణామార్కెట్, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా నాటుకోళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. పూర్ణామార్కెట్‌లో నాటుకోళ్లు కొనుగోలు చేసేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. శని, ఆదివారాల్లో నాటు కోళ్ల అమ్మకాలు భారీగా సాగాయి. దసరా రోజు పొట్టేళ్ల ధరలు పోటీపడ్డాయి. పుంజులు కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు అమ్మారు. కోడి పెట్టలకు గిరాకీ పెరగడంతో కేజీ రూ. 800 నుంచి రూ.1000 వరకు పెంచేశారు. దసరా పండుగను ఇంటిల్లిపాది సందడిగా, సంతోషంగా జరుపుకొనేందుకు ఇష్టపడతారు. ఆహారంలో అత్యధిక శాతం మంది మాంసాహారాన్ని ఇష్టపడతారు. పూర్ణామార్కెట్‌లో కోళ్ల వ్యాపారులు భారీగా ధరలు పెంచి అమ్మడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. నాటుకోళ్ల పేరుతో గిరిరాజా కోళ్లను అంటగట్టడంతో కొనుగోలుదారులు జాగ్రత్తపడ్డారు. కోళ్ల వ్యాపారులు నాటుకోళ్లలో నిక్కచ్చి అయినవి అంటూ వారు చెప్పిన ధరకే విక్రయాలు జరిపారు. పుంజులు దొరక్క తప్పని పరిస్థితిలో కోడిపెట్టలను కొనుగోలు చేశారు. దసరా పండుగ నాటుకోళ్ల వ్యాపారులకు భారీగా లాభాలు తెచ్చిపెట్టింది.

సనాతన మార్గమే దిక్సూచి

అక్కయ్యపాలెం, అక్టోబరు 13: భారతీయ సంస్కృతి పరిరక్షణకు సనాతన సంప్రదాయాన్ని పాటించడమే ముఖ్యమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి అన్నారు. అక్కయ్యపాలెంలోని మాస్టర్ హోమియో వైద్యశాలలో పది రోజులుగా జరుగుతున్న దుర్గ పూజల ముగింపు ఉత్సవంలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య వద్ద పొందిన ప్రేరణతో వేద సూక్తులు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా మాస్టర్ హోమియో వైద్యశాలలో శరన్నవరాత్రులు, వసంత నవరాత్రుల పూజలు, రుద్రాభిషేకాలను నిర్వహించామన్నారు. ఉచిత హోమియో వైద్యంతో పాటు అన్న, వస్త్రదానాలు కూడా చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 120 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ శాస్త్రిని సత్యదేవ్, హోమియో సేవకులు మద్దూరి హనుమంతరావు, సీహెచ్ నరసింహమూర్తి, కె.శ్రీనివాస్‌లు ఘనంగా సత్కరించారు.



కేఎస్ శాస్త్రిని సత్కరిస్తున్న హోమియో సేవకులు

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్

జ్ఞానాపురం, అక్టోబరు13: జీవీఎంసీ 41వ వార్డులో పారిశుధ్య సేవలు అందిస్తున్న మహిళా కార్మికులకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్‌లు సొంత నిధులతో ఆదివారం జ్ఞానాపురంలోని కార్యాలయంలో చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఏ పండుగ వచ్చినా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటున్నామంటే చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్మికుల సేవలు అమోఘమని వారు అన్నారు. 34వ వార్డులో జనసేన అధ్యక్షుడు నీలం రాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు, శీతలపానీయాలు అందజేశారు. ఈ సందర్భంగా కొంత మంది పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తెలుగు అర్జున్, నారా నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం జనరంజక పాలన'

డాబాగార్డెన్స్, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం జనరంజకంగా పరిపాలన సాగిస్తోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వైసీపీకి బై బై చెప్పడంతో శారదా పీఠానికి నిధుల ప్రవాహం ఆగిపోయిందని వ్యాఖ్యానించారు. పెందుర్తి సమీపంలోని చిన్నముషిడివాడలో ఉన్న శారదాపీఠం అక్రమాలపై అధికారులు ఇంకా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కొందరు అధికారుల వైఖరిని చూస్తే వైసీపీ ప్రభుత్వం కొనసాగుతుందా? అనే అనుమానం రేకెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు గడిచినప్పటికీ ఇంకా అక్కడక్కడ నిర్లక్ష్యం కనిస్తోందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ పుషూర్ నికుంజ్, కోరుకొండ శ్రీనివాసరావు, జి.విజయరమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విజయాల కరపత్రాన్ని చూపుతున్న బి.వి.రామ్ తదితరులు

వైసీపీ సేవలోనే జీవీఎంసీ ఇంజనీర్లు

... 5వ పేజీ తరువాయి

ఆర్అండ్‌డీ యార్డుకు కొట్టుకువస్తాయి. ఇవి నేరుగా సముద్రంలో కలిసిపోకుండా గ్రిల్స్ ఏర్పాటుచేశారు. వీటి వద్ద వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడతాయి. ఓ గంట మురుగునీరు నిలిచిపోతే ఎర్రిగెడ్డ పొడుగునా పారిశుధ్య సమస్య తలెత్తుతుంది. దీంతో ఆర్అండ్‌డీ యార్డు వద్ద నిత్యం జేసీబీలతో పూడికతీసి, టిప్పర్లలోకి లోడ్‌చేసి తరలిస్తుంటారు. ఈ పనుల కోసం ఏడాదిపాటు గెడ్డలో పూడిక, వ్యర్థాలు తీసేందుకు జీవీఎంసీ అధికారులు టెండర్ పిలుస్తుంటారు.

కీలక నేత బంధువనే...

జీవీఎంసీకి 2021లో ఎన్నికలు జరగ్గా వైసీపీ మెజారిటీ వార్డులను దక్కించుకుంది. దీంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లే మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నికయ్యారు. వీరిలో ఒకనేత బంధువు తన భార్యపేరుతో జీవీఎంసీ కాంట్రాక్టర్‌గా రిజిస్టరై ఉండడంతో ఎర్రిగెడ్డలో పూడిక, వ్యర్థాలు తీసే కాంట్రాక్టుపై కన్నేశాడు. పాలకవర్గంలో కీలకపదవిలో ఉన్న తన బంధువు అండతో అధికారులపై ఒత్తిడిచేసి ఎర్రిగెడ్డ నిర్వహణ టెండర్ తనకే దక్కేలా పావులు కదపాడు. అధికారులు దీనికి సహకరించడం, పోటీగా ఎవరైనా టెండర్ వేస్తే ఇబ్బందులు తప్పవనే భయం సృష్టించారు. దీంతో మూడేళ్లుగా అదే కాంట్రాక్టర్ పనులు దక్కించుకుంటున్నాడు. తాజాగా ఎర్రిగెడ్డలో ఏడునెలలపాటు పూడిక, వ్యర్థాలను తీసేందుకు రూ.80.33 లక్షలతో జీవీఎంసీ అధికారులు ఈ నెల 7న షార్ట్‌టెండర్ పిలిచారు.

అడ్డగోలు నిబంధనలు

నగర పరిధిలోని గెడ్డల్లో పూడికతీతకు జీవీఎంసీ ఏటా రూ.8 కోట్ల వరకూ ఖర్చు చేస్తుంది. ఒక్కో స్ట్రెచ్‌ను ఒక వర్కుగా తీసుకుని రూ.3 లక్షల నుంచి రూ.90 లక్షల పనులకు టెండర్లు పిలుస్తుంది. ఒక్కో కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటయ్యే మొత్తానికి బిడ్ వేసి పని దక్కించుకుంటారు. అద్దెకు జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు తెచ్చుకుని ఎప్పటికప్పుడు పనులు పూర్తిచేస్తారు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఈ పనులు దక్కించుకునేందుకు ఇతర కాంట్రాక్టర్లు పోటీపడతారని గుర్తించిన ప్రస్తుత కాంట్రాక్టర్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడిచేసి, అర్హత పేరుతో అడ్డగోలు నిబంధనలు తెరపైకి తెచ్చారు. వీటిలో ముఖ్యంగా టెండర్‌లో పాల్గొనే కాంట్రాక్టర్ గతంలో కనీసం రూ.68.88 లక్షల విలువైన అదేతరహా పని చేసి ఉండాలని, ఈఎక్స్-70 ఎక్స్‌కవేటర్‌ను కనీసం 1,095 గంటలు వినియోగించి ఉండాలని, ఐదు టన్నుల టిప్పర్లు కనీసం 3,389 గంటలు సొంతంగా లేదా అద్దె ప్రాతిపదికనైనా వినియోగించాలనే నిబంధన విధించారు. దీనివల్ల వైసీపీ నేత బంధువు మాత్రమే టెండర్ దాఖలుకు అర్హుడుగా మిగిలేలా అధికారులు ఎత్తులు వేశారు. తాము కూడా టెండర్‌లో పాల్గొన్నామని, అధికారులు అడిగిన అర్హతలు లేకపోవడంతో అనర్హులుగా ప్రకటించారని ఇతర కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వైసీపీ నేత బంధువుకే పనులు అప్పగించేలా రంగం సిద్ధం చేశారని ఆరోపిస్తున్నారు. గతంలో లేని అర్హత నిబంధనలు ఎందుకు పెట్టారని అధికారులను ప్రశ్నించడంతో పాటు, న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నామని చెబుతున్నారు.


ట్రస్టీలకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్, సుభాషిణి దంపతులు

శ్రీవారి వెండి అభయ హస్తాల కోసం రూ.లక్షా 70 వేల విరాళం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 13: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువు దీరిన వేంకటేశ్వరస్వామి వారి వెండి అభయ హస్తాల తయారీ నిమిత్తం స్థానిక వ్యాపారవేత్త బండారు శ్రీనివాస్, సుభాషిణి దంపతులు రూ.లక్షా 70 వేలను విరాళంగా చెక్కు రూపంలో ట్రస్టు సభ్యులకు శనివారం అందజేశారు. కాగా దివ్యక్షేత్రంలోని ప్రత్యేక వేదికపై నిర్వహించిన శ్రీనివాస శాంతి కల్యాణంలో పాలకమండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

క్రైమ్ ఎస్‌ఐగా జి.తేజేశ్వరరావు



గోపాలపట్నం, అక్టోబరు 13: గోపాలపట్నం క్రైమ్ ఎస్‌ఐగా జి.తేజేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో గోపాలపట్నం క్రైమ్ ఎస్‌ఐగా ఇక్కడకు వచ్చారు.

'పెందుర్తి'లో అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

పెందుర్తి, అక్టోబరు 13: పెందుర్తి నియోజవర్గ పరిధి సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల్లో అభివృద్ధి పనుల కోసం ఉపాధి నిధులు రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు క్యాంపు కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పలు గ్రామ పంచాయతీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల (సీసీ రోడ్లు)కు సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు ముదపాక, పదిన్నరకు గుర్రమ్మపాలెం, 11.30 గంటలకు వాలిమెరక జుత్తాడ, మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఎస్‌ఆర్‌పురం, మూడు గంటలకు గవరపాలెం, సాయంత్రం నాలుగుకు గొరపల్లి, ఐదుకు పినగాడి, ఆరు గంటలకు రాంపురం గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటించనున్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో సమాధి ఉత్సవం


సాయి నామాన్ని జపిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి, అక్టోబరు 13: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం సమాధి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు గంటల పాటు సాయి నామాన్ని ఏకధాటిగా జపించారు. అలాగే సాయిబాబా సహస్రనామ పారాయణాన్ని పఠించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు కొయ్య వెంకట రమణారెడ్డి, వ్యాసశర్మ, సత్యలక్ష్మి, పంకజ, లీలావతి, కృష్ణవేణి, జానకీ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)


ఉల్లిపాయలు 49, టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 26, క్యారెట్ 42 దొండకాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 100, మునక్కాడలు (కిలో) 82, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు



బ్యాగ్

రైతు ధర	--	122
ఫారం ధర	--	142
విత్ స్కిన్	--	254
స్కిన్‌లెస్	--	264

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


అభివృద్ధికి నోచుకోని శ్రీరామ్ నగర్ ప్రధాన గెడ్డ


ఆక్రమణలతో కుదించుకుపోయిన వెంకటాపురం గెడ్డ

ఆధునికీకరణకు నోచుకోని గెడ్డలు

ఆక్రమణలతో కుదించుకుపోయిన వైనం
వర్షం కురిసినప్పుడల్లా రహదారులపై పారుతున్న మురుగు నీరు
అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకుంటున్న ప్రజలు

గోపాలపట్నం, అక్టోబరు 13: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 89, 92 వార్డుల పరిధిలో పలు ప్రాంతాల్లో ఉన్న గెడ్డల ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారి కోతకు గురవుతున్నాయి. గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల నుంచి వర్షపు నీరు పల్లపు ప్రాంతాలకు ప్రవహించడానికి దశాబ్దాల క్రితం సహజ సిద్ధంగా ఏర్పడిన గెడ్డలు జనావాసాలతో ఇప్పటికే చాలావరకు ఆక్రమణకు గురై కుదించుకుపోయాయి. దీంతో వర్షాల సమయంలోని నీరు, సాధారణ రోజుల్లో మురుగు నీరు సజావుగా ముందుకు సాగక తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికితోడు గెడ్డల్లో మురుగు, పూడికలు పేరుకుపోవడంతో తరచూ ఏర్పడుతున్న సమస్యలతో సతమతం అవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 92వ వార్డులో శ్రీరామ్‌నగర్ నుంచి కొత్తపాలెం అండర్ పాత్‌వే వరకు గల గెడ్డ ఆధునికీకరణకు నోచుకోలేదు.

అదేవిధంగా వెంకటాపురం, నందమూరి నగర్ ప్రాంతాల్లో గల గెడ్డలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆయా గెడ్డలను ఆధునికీకరిస్తే ఆక్రమణలు తగ్గడంతో పాటు జనాలకు కూడా ఇబ్బందులు తీరుతాయని చెప్పవచ్చు. అందువల్ల ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


88వ వార్డు ఎస్టీబీఎల్‌లో పుష్పాలతో రాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన పోలమాంబ


నాయుడుతోట కృష్ణా నగర్ ఆలయంలో రాజరాజేశ్వరిగా పూజలందుకున్న దుర్గాదేవి


70వ వార్డు ఎల్‌వీ నగర్ ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా కనకదుర్గమ్మ

వైభవంగా విజయ దశమి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన కనకదుర్గాదేవి ఆలయాలు, మండపాలు

ఆటోనగర్, అక్టోబరు 13: పారిశ్రామిక ప్రాంతంలో విజయ దశమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) ఆధ్వర్యంలో దుర్గాదేవి సన్నిధిలో లలితా సహస్ర పూజ, చండీ హోమం జరిపారు. పూజల్లో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామప్రసాద్, కోశాధికారి పరుచూరి ప్రభాకర్, ఐలా మాజీ చైర్మన్‌లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, పారిశ్రామిక వేత్తలు ఏ.కె.బాలాజీ, లంక బాపిరాజు, కొల్లి ఈశ్వరరావు, పి.పద్మావతి, చీకటి సత్యనారాయణ, సర్వసిద్ధి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఐలా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ రఘు, కొల్లి ఈశ్వరరావు, సత్యనారాయణ, పద్మావతి, సిబ్బంది అంబిక, నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్‌పోలమాంబ ఆలయంలోని అమ్మవారిని గులాబీ, చామంతి పువ్వులతో శోభాయమానంగా అలంకరించారు. 87వ వార్డు లక్ష్మీపురం త్రిశక్తి ఆలయంలోని అమ్మవారి విజయదుర్గగా అలంకరించి అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. 70వ వార్డు ఎల్‌వీ నగర్ ఆలయంలోని అమ్మ వారు, డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని కాశీవిశాలాక్షి అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి, తదితర భక్తులు పాల్గొన్నారు. 87వ వార్డు కణితి, వడ్లపూడిల్లో అమ్మవార్లను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించగా, పూజాది కార్యక్రమాల్లో కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు సూరిశెట్టి పెంటారావు, కాండ్రేకుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: దసరా పర్వదినాన గాజువాక పరిసర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల వద్ద భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకటుకున్నాయి. మధ్యాహ్నం పలుచోట్ల అన్న సమారాధనలు చేపట్టారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో నవచండీ యాగంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. మహాదుర్గా అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిగా, మహాలక్ష్మిని మహాలక్ష్మీదేవిగా, మహా సరస్వతిని వరదాయిగా అలంకరించాక శమీ పూజ చేశారు. ఆదివారం విశేష పూజలు జరిపాక నవరాత్రుల్లో అమ్మవార్లను అలంకరించిన పసులు, కుంకుమలతో పాటు ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

అగనంపూడి: ఇక్కడి పోస్టాఫీసు వద్ద గల దుర్గమాంబ ఆలయంలోని అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకుని చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. పెదమడక కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.


గాజువాక మెహర్ నగర్‌లో కనకాదుర్గాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


శారదాపీఠంలో విజయదుర్గ అవతారంలో పూజలు అందుకున్న రాజశ్యామల అమ్మవారు


అక్కిరెడ్డిపాలెంలో దుర్గాదేవి సన్నిధిలో పల్లా శ్రీనివాసరావు, ఇతర నాయకులు


వాసీవాలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ పూజల్లో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధి ఆలయంలోని దుర్గాదేవిని రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. శత చండీయాగాన్ని పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపును నాయుడుతోట నుంచి వేపగుంట మీదగా ఆర్‌ఆర్‌వీ పురం నుంచి అమ్మవారి గుడి వరకు చేపట్టారు. ఆదివారం ఆలయంలో చండీ శాంతి హోమం, నక్షత్ర హారతి, కర్పూర హారతితో ఉత్సవాలను ముగించారు. నాయుడుతోట వేద మాత గాయత్రి అమ్మవారి ఆలయంలో, వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవార్లను రాజరాజేశ్వరిగా అలంకరించి పూజలు జరిపారు. అప్పన్నపాలెం వర్షిణి టవర్స్‌లోని జీ-బ్లాక్‌లో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

ఎన్‌ఏడీ జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనలు చేపట్టారు. విమాన్‌నగర్‌లో దుర్గాదేవి నవరాత్రి ముగింపోత్సవంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని పూజలు అన్న సమారాధనను ప్రారంభించారు. ఎన్‌ఏడీలో మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి.

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని విజయదుర్గగా అలంకరించి పూజలు చేశారు. యాగశాలలో రాజశ్యామల సహిత చండీయాగానికి రుత్విక్కులు పూర్ణాహుతి చేశారు. అనంతరం పీఠం ప్రాంగణంలోని శమీవృక్షానికి ఆయుధ పూజ చేశారు.

అక్కిరెడ్డిపాలెం: శరన్నవ రాత్రుల ముగింపు సందర్భంగా అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద, హరిజన జగ్గయ్యపాలెం కాలనీలోని దుర్గాదేవిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, శీరం రాజేశ్, బొడ్డు రమణ, గుంటూరు నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు. అక్కిరెడ్డిపాలెం హై స్కూల్ మైదానంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మను భవానీ భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి సారె సమర్పించారు. అనంతరం సహస్ర దీపార్చన చేశారు.


అగనంపూడిలో రాజరాజేశ్వరిగా పూజలందుకున్న దుర్గమ్మ


ఉక్కు త్రిశక్తి ఆలయంలో రాజరాజేశ్వరిగా మహాదుర్గ

'సమాచార హక్కు చట్టంపై ప్రజలందరికీ అవగాహన ఉండాలి'

అగనంపూడి, అక్టోబరు 13: అవినీతిని నిర్మూలించేందుకు సమాచార హక్కు చట్టంపై అందరూ అవగాహన కల్పించుకోవాలని ఆ చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు కోరారు. సమాచార హక్కు చట్టం గురించి ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి రహిత సమాజ స్థాపన సమాచార హక్కు చట్టంతోనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా యువతీ యువకులు ఈ చట్టం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కొల్లి సత్యారావు, స్థానిక నాయకులు నెల్లి శ్రీనివాసరావు, వి.రాము, బలిరెడ్డి శ్రీను, పైడికొండ, శ్రీను త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామ అప్పారావు


65వ వార్డు వాంబే కాలనీలో పూజలందుకున్న శ్రీవారు


నాయుడుతోటలో అన్నదాతలకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

వైభవంగా శమీవృక్ష పూజ

పెదగంట్యాడ, అక్టోబరు 13: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని వేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి శమీవృక్ష పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌చంద్ర శమీవృక్ష పూజ ప్రాధాన్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శేషాద్రి కొండపై శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో శ్రవణా నక్షత్రం పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువ జామున శ్రీవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అన్న సమర్పణకు ఆర్థిక సహాయాన్ని అందించిన వెంకటసాయినగర్‌కు చెందిన గౌరీనాయుడు, రామలక్ష్మి దంపతులు, యజ్ఞేశ్వర్, ప్రవల్లిక కుటుంబ సభ్యులకు అర్చకులు శ్రీనివాసస్వామి శ్రీవారికి జ్ఞాపికలను అందజేశారు. సాయంత్రం భక్తులు సామూహిక భక్తి గీతాలాపన, విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించారు.

మహాకామేశ్వరి పీఠంలో శ్రీవారి కల్యాణం

పెందుర్తి: మండలంలోని రాంపురంలో గల మహాకామేశ్వరి పీఠం పీఠం ప్రాంగణంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పీఠం ప్రాంగణంలో పత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను ఆసీనులు చేసి మంగళవాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరుని పరిణయ ఘట్టాన్ని వివరిస్తూ గాయత్రి, శృతిల అన్నమయ్య కీర్తనలు అందరినీ అలరించాయి. భక్తుల గోవింద నామస్మరణతో మహాకామేశ్వరి పీఠం మార్మోగింది. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉత్తర పీఠాధిపతి శక్తీదేవి వై.విజయ, పీఠం ప్రతినిధులు ధనలక్ష్మి, రాజీ, జయశ్రీ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఏలకు న్యాయం చేయాలి

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 13: వైద్య ఆరోగ్య శాఖలో 2002 నుంచి కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్ఏ)కు జీవో నంబర్-167ను అమలు చేసి ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఎంపీహెచ్ఏ సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం షీలానగర్ విచ్చేసిన ఆయనను సంఘ సభ్యులు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చినట్టు సభ్యులు సాయికిరణ్, శ్యామ్, వేణుబాబు, మల్లేశ్వరరావులు తెలిపారు.

పలు సమస్యలను పరిష్కరించాలని..


అగనంపూడి: అగనంపూడి ప్రాంత సమస్యలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. లోవోల్టేజీ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, యువత కోసం క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని, దువ్వాడ వెళ్లే ప్రధాన రహదారిలో లైట్లు వీధి లైట్లను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, బలిరెడ్డి ప్రకాశ్, బండారు చందూరమేశ్, వడ్డాది ప్రసాద్, పి.పైడిరత్నం, కర్రి రమణి, రామతులసి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పేరుకుపోయిన చెత్తాచెదారం


హై స్కూల్ రోడ్డులో డస్ట్‌బిన్ నిండిపోవడంతో రోడ్డుపై చేరిన చెత్త

గాజువాక, అక్టోబరు 13: దసరా పండగ నేపథ్యంలో వరసగా మూడు రోజులు సెలవులు రావడంతో పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. శుక్ర, శని, ఆదివారాలు సెలవు కావడంతో పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. డస్ట్‌బిన్లు పూర్తిగా నిండిపోవడంతో రహదారుల పైకి చెత్త చేరుతుంది. దీంతో పందులు, కుక్కలు, ఇతర పశువులు వాటిని చిందరవందర చేస్తుండడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెలువడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి చెత్తాచెదారాన్ని తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్


ప్లాట్‌ఫారాన్ని శుభ్రపరిచిన వివిధ సంస్థల ప్రతినిధులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 13: పరిసరాల పరిశుభ్రత వల్ల అంటురోగాలు దరి చేరవని కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధరరెడ్డి అన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, అగనంపూడి, లయన్స్ క్లబ్ సభ్యులు, యంగ్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సత్యసాయి సేవా సమితి, మానవతా సమితి, స్పందన చేయూత, మానవ వికాస వేదిక, సర్వహిత చారిటబుల్ ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని పిచ్చిమొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కంచుమూర్తి ఈశ్వర్, జాషువా, వీర్రాజు, కేవీ ప్రసాద్, రామకృష్ణ, కోటేశ్వరరావు, నాయుడు, రాజు, లక్ష్మి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రామాయణ పారాయణం సమాప్తం

సింహాచలం, అక్టోబరు 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3 నుంచి చేపట్టిన రామాయణ పారాయణం ఆదివారం నాటి పట్టాభిషేక సర్గ విన్నపంతో పరిసమాప్తమైంది. గత పది రోజుల్లో ప్రతిరోజూ ఉదయం ఆలయ బేడా మండపంలోని హంసమూలన అధ్యాపకుడు టిపి రాజేశ్ వాల్మీకి విరచిత రామాయణ మహాకావ్యాన్ని పఠించారు. ఆఖరిరోజు మధ్యాహ్నం స్వామివారి రాజభోగ నివేదన సమయంలో రామా పట్టాభిషేక సర్గ విన్నపం జరిపారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ అధ్యాపకుడ్ని ఘనంగా సత్కరించారు.

రైతుబజార్ వెలవెల



పండగ వేళ సీతమ్మధార రైతుబజారు ఇలా...

సీతమ్మధార, అక్టోబరు 13: నగరంలో అతి పెద్ద రైతుబజార్లలో ఒకటైన సీతమ్మధారలో రైతులు కానరాక, బజార్‌లో కూరగాయలు లేక ఆదివారం బోసిపోయింది. దసరా పండుగ సందర్భంగా రైతులు ఇళ్ల వద్ద పండుగ చేసుకోవడంతో చాలా మంది బజారుకు రాలేదు. కొద్దిమంది వచ్చినా తక్కువగా తెచ్చిన కూరగాయలు విక్రయించి తొందరగా ఇళ్లకు వెళ్లిపోయారు. కొనుగోలుదారులు సైతం పెద్దగా రాకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బక్క నారాయణరావు (ఫైల్ ఫోటో)

మర్రిపాలెం, అక్టోబరు 13: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మర్రిపాలెం సాయినగర్‌లో ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో గోవుల సంరక్షణ బాధ్యతను పార్వతీపురం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన బక్క నారాయణరావు గత నెల 27 నుంచి చూస్తున్నాడు. అయితే ఈ నెల 2న బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి రాకపోవడంతో పలువురిని వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో శానాపతి ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఈ వ్యక్తి ఆచూకీ కనుగొంటే ఈ ఫోన్ 94403 59124 నంబరులో తెలియజేయాలని కోరారు.

కోటవీధి వాసుల కల ఫలిస్తున్న వేళ..

» ఫెర్రీ మురుగు కాలువ సమస్యకు చెక్ » బ్రిడ్జి నిర్మాణానికి పోర్టు అథారిటీ చర్యలు

జగదాంబ కూడలి, అక్టోబరు 13: వన్‌టౌన్ కోటవీధి నివాసీయుల వెతలు తీరే రోజులు సమీపించాయి. అలవి కాని సమస్యలతో అల్లాడిపోయిన వీరికి కాస్త సాంత్వన లభించింది. ఇంతకాలం పోర్టు కాలుష్యం, ఫెర్రీ రోడ్డు వద్ద మురుగు నీటి సమస్యతో జీవనం సాగించాల్సిన దుస్థితి వీరిది. పోర్టు అథారిటీ తక్షణం ఫెర్రీ రోడ్డులో మురుగు నీటికి చెక్ పెట్టేలా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలంటూ కోట వీధి ప్రాంతానికి చెందిన ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనేక పోరాటాలు చేశారు. అయినా సరే పోర్టు యాజమాన్యం గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏనాడూ స్పందించలేదు. ఫెర్రీ రోడ్డులో నివాసీయులు, కోట ప్రాంతవాసులు ఫెర్రీ రోడ్డు వద్ద మురుగు నీటితో నిత్యం యాతన పడేవారు. వర్షకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఎన్నికల సమయంలో కూటమి తరఫున బరిలో నిలిచిన పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్, దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణలు ప్రత్యేకంగా ఫెర్రీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం జరిగేలా పోర్టు యాజమాన్యంతో మాట్లాడతామని హామీ ఇచ్చి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫెర్రీ రోడ్డు పరిస్థితిలో మార్పు రాకపోవడంతో కోటవీధి ప్రాంతీయులు, 39వ వార్డు ప్రజానీకం టీడీపీ కూటమి అభ్యర్థుల వైపు మొగ్గారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో ఫెర్రీ రోడ్డు మురుగు నీటి దుస్థితి నివారణకు చర్యలు చేపట్టారు. పోర్టు యాజమాన్యంతో ఎంపీ భరత్ పలుమార్లు చర్చలు జరిపి ఫెర్రీ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఒప్పించారు. దీంతో రెండు నెలలుగా ఫెర్రీరోడ్డు వద్ద పోర్టు యాజమాన్యం బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతోంది. కొన్నేళ్లుగా ఫెర్రీ రోడ్డు నివాసీయులు పడుతున్న ఇబ్బందులు తొలగుతుండడం, మురుగు నీటి నిల్వలు లేని గెడ్డలు కనిపిస్తుండడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఎన్నో పోరాటాల తరువాత బ్రిడ్జి నిర్మాణ పనులు జోరుగా సాగడం పట్ల ముస్లిం వర్గాలు, స్థానిక ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



పోర్టు అథారిటీ నిర్మిస్తున్న ఫెర్రీ రోడ్డు బ్రిడ్జి

వీనుల విందుగా దసరా సంగీత మహోత్సవం

» మోరుమోగిన ప్రముఖుల సంకీర్తనలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 13: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత మహోత్సవం ఆహూతులకు వీనుల విందు చేసింది. డాబాగార్డెన్స్‌లోని ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం వ్యవస్థాపకులు ఆకొండి వెంకట్రావు సారథ్యంలో 12 గంటల పాటు నిర్విరామంగా ఇక్కడి విద్యార్థులు మృదు మధురంగా సంకీర్తనగానం నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి మఠంలో ఆ కొండి వెంకట్రావు, ఆయన శిష్య బృందం, గాయనీ గాయకులంతా త్యాగరాజస్వామి, అన్నమాచార్య, పురందరదాసు సంకీర్తనలు, భజనలు గానం చేశారు. కళా ప్రాంగణం సంకీర్తనలతో మోరుమోగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రఘురామారావు, శాంతి దంపతులు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సంస్థ ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.మధుబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

23న నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట, అక్టోబరు 13: ఈ నెల 23న ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులు ఒక్కొక్కటి, అయిదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకుంటారని తెలిపారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న ఉపసంహరణకు గడువని తెలిపారు. 23న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని క్లాక్ రూమ్ వద్ద ఎన్నికలు నిర్వహించిన అనంతరం అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

దసపల్లా భూములపై ప్రభుత్వం ఆరా!

... 5వ పేజీ తరువాయి

భూ యజమానులకు కేవలం 30 శాతం, ప్రభుత్వ పెద్దలు, నిర్మాణ సంస్థకు 70 శాతం వాటా తీసుకున్నారు. ఇక్కడ 75,939 చదరపు గజాల స్థలంలో 27.55 లక్షల చదరపు అడుగుల నివాస, వాణిజ్య భవనాలు నిర్మిస్తామని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో అనేక సెటిల్‌మెంట్లకు పాల్పడిన, యూఎల్‌సీ కింగ్‌గా పేరొందిన వ్యక్తి ఇందులో భారీగా లబ్ధి పొందారు. అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్‌లో అప్పటి సబ్ రిజిస్ట్రార్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దసపల్లా భూముల వ్యవహారంలో వేలకోట్ల లావాదేవీలపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి విపక్ష టీడీపీ, జనసేన నేతలు వేర్వేరుగా పోరాటాలు చేశారు. కూటమి అధికారం చేపట్టిన తరువాత గత నెలలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా దసపల్లా భూములను సందర్శించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన దర్బార్‌లో ఈ భూములపై కొంతమంది ఆయనకు ఫిర్యాదుచేశారు. విశాఖలో భూముల దోచుకున్న వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేయాలనే ఆలోచనతో దసపల్లా భూములపై ప్రభుత్వం నివేదిక కోరింది. దీంతో ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలపై జిల్లా యంత్రాంగం నివేదిక సిద్ధంచేసి పంపనున్నది.

లాటరీకి వేళాయె!

... 5వ పేజీ తరువాయి

కేటాయిస్తారు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి ఒకవేళ అనుకున్న సమయానికి నిర్దేశించిన లైసెన్స్‌ఫీజు వాయిదా చెల్లించలేని పక్షంలో తర్వాత మరొకరికి అవకాశం ఇచ్చేందుకు వీలుగా మరో ఇద్దరిని ఎంపిక చేసి, స్టాండ్‌బైగా ఉంచుతారు. ఇలా 155 దుకాణాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా లాటరీ తీసే ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఉదయం ఎనిమిది గంటలకు గెజిట్ నంబరు ఒకటి దుకాణానికి లాటరీ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ కోసం అధికారులు ఏర్పాట్లుపూర్తిచేశారు. లాటరీ సందర్భంగా ఎవరు ఏయే విధులు నిర్వర్తించాలనే దానిపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు

... 5వ పేజీ తరువాయి

వచ్చే ఏడాది మార్చితో ముగియనున్నది. మరోసారి ఆయన పోటీకి సిద్ధపడుతుండగా, మరికొంతమంది ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ పర్యాయం పోటీచేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, రిటైర్డు అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏపీటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేస్తారని ఆ సంఘం ఇప్పటికే ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా బరిలో ఉంటానని వెల్లడించారు. తమ సంఘం నుంచి అభ్యర్థిని ఖరారు చేసేందుకు వీలుగా ఈనెల 15వ తేదీన యూటీఎఫ్ సమావేశం నిర్వహించనున్నది. మిగిలిన ప్రధాన సంఘాలు బరిలో నిలవాలా లేక భావ సారూప్యత కలిగిన సంఘాలతో కలిసి పోటీచేయాలా? అన్నదానిపై ఇంకా నిర్ణయానికి రాలేదు. విశాఖ ఇంటర్‌బోర్డులో ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేసి, ఈ ఏడాది జనవరిలో రిటైరైన ఆర్.సత్యనారాయణ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యాపకులకు వాట్సాప్ మేసేజ్‌లు పంపడమేకాకుండా స్వయంగా కలుస్తున్నారు. ఆనందపురం ఎంఈవోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పద్మావతి ఎమ్మెల్సీగా పోటీచేయాలని సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదిలావుండగా నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఎమ్మెల్సీగా పోటీచేయాలని నిర్ణయించి ఇప్పటికే పలువురు ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లను కలిశారు. రాయలసీమకు చెందిన వైసీపీ సానుభూతిపరుడైన ఎమ్మెల్సీ మద్దతుతో బరిలో నిలవాలని ఆయన నిర్ణయించారు. వచ్చే నెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించనున్నందున అప్పటికి ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వస్తుందని సంఘనేతలు చెబుతున్నారు.

నగరానికి దసరా కిక్కు

... 5వ పేజీ తరువాయి

ఈ ఏడాది స్వల్పంగానే పెరిగాయని, దీనికి కారణం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పెద్దగా స్టాకు లేకపోవడమేనని చెబుతున్నారు. ప్రభుత్వ దుకాణాలను మరో రెండు రోజుల్లో మూసేస్తుండడంతో సరకు సరఫరాపై నియంత్రణ, ప్రీమియం బ్రాండ్‌లు లేకపోవడంతో మందుబాబులంతా బార్‌లకు పోటెత్తారని చెబుతున్నారు. బార్లలో కౌంటర్ సేల్స్‌కు డిమాండ్ పెరిగిందని అభిప్రాయపడుతున్నారు.

రూ. 10 కోట్ల మాంసం తినేశారు

దసరా శనివారం కావడంతో మాంసం విక్రయాలపై తీవ్రప్రభావం పడింది. పండగ సందర్భంగా వాహనాలు, మార్కెట్లు, దుకాణాలు, పరిశ్రమల వద్ద మొక్కుబడిగా మేక/గొర్రెపోతులను బలిస్తుంటారు. ఆ మాంసాన్ని అసోషియేషన్ల సభ్యులు, కళాసీలు, కార్మికులకు పంచిపెడుతుంటారు. కానీ శనివారం కావడంతో జంతుబలి లేకుండానే పూజలు పూర్తిచేసి, ఆదివారం మజాను ఆస్వాదించారు. జిల్లాలో సుమారు 600 వరకూ మటన్ దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ సగటున ఐదు మేకలు/గొర్రెపోతులు విక్రయిస్తుంటారు. దసరా సందర్భంగా రెట్టింపు సంఖ్యలో విక్రయాలు జరిగినట్టు వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఒక్కోమేక/గొర్రెపోతు సగటున 10 కిలోలు ఉంటుందనుకుంటే ఒక్కో దుకాణంలో వంద కిలోల చొప్పున ఆరు వేల కిలోల మటన్ అమ్ముడైంది. మటన్ కేజీ రూ.వెయ్యి కావడంతో రూ.ఆరు కోట్లు విక్రయాలు సాగాయి. ఇది కాకుండా మొక్కుబడుల పేరుతో జిల్లా వ్యాప్తంగా సుమారు మరో 500 వరకూ మేక/గొర్రెపోతులను బలి ఇచ్చారు. దీంతో మరో ఐదు వేల కిలోల మటన్ పంపిణీ జరిగిందని భావిస్తే ఇది రూ.ఐదు కోట్లు వరకూ ఉంటుంది. అన్నింటినీ కలిపితే రూ.పది కోట్లకు పైగా మటన్ విక్రయాలు జరిగివుంటాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దసరా రోజున చికెన్‌కు డిమాండ్ తక్కువగా ఉంటుంది కాబట్టి వాటి విక్రయాలను వ్యాపారులు పరిగణనలోకి తీసుకోలేదు.



మాధవధారలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న దుర్గాదేవి



కళింగనగర్‌లో అనుపు ఉత్సవంలో జన నీరాజనాలు

ఉత్సాహంగా దుర్గమ్మ నిమజ్జన సంబరం

మురళీనగర్, అక్టోబరు 13: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఈ ఏడాది అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు జరిగాయి. మునుపెన్నడూ లేని విధంగా జనం సంబరాలు చేసుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో స్వామి శనివారం విశిష్ట వజ్ర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మురళీనగర్ హైస్కూలు సమీపంలోని రామాలయం వద్ద లలితాదేవి సన్నిధిలో ఆదివారం భక్తులకు సామూహిక అన్నదానం జరిపారు. 51వవార్డు సీతన్నగార్డెన్స్ కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగించి, భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. 49వ వార్డు కంచరపాలెం బర్మాక్యాంప్ శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో కొలువుదీర్చిన దేవీ ప్రతిమ అమ్మవారి అనుపు ఉత్సవం జరిపారు. కాలనీల్లో భారీ ఎత్తున పూజా మండపాల నుంచి దేవి ప్రతిమలు సాగర నిమజ్జనానికి తరలించారు. ధూప దీప నైవేద్యాల మధ్య సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు, భక్తుల కోలాహలంతో నిమజ్జన కార్యక్రమం జరిపారు. మరో వైపు శనివారం కొన్ని చోట్ల దేవీ విగ్రహాల్ని ప్రతిష్ఠించి వేడుకలు ఈ నెల 21 వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ శివరామకృష్ణ దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇక్కడి అమ్మవారు ఉమాదేవిని చివరిరోజు రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భార్గవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, శమీవృక్ష పూజ, చండీ హోమం జరిపి పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు, మంత్రపుష్పాలు సమర్పించి దివ్య మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, మన్మథరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు

సీతమ్మధార: సీతమ్మదార పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల క్రీడాభారతి ఆధ్వర్యంలో షైక్ బాక్సింగ్ క్లబ్ సభ్యులు దసరా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి క్రీడా భారతి అధ్యక్షులు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దుర్గాదేవి పూజా మహోత్సవాన్ని నిర్వహించి క్రీడాకారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులంతా ఆటల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ ధినిష్, చిత్ర ఆనంద్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోరుగా నాటుకోళ్ల విక్రయం



పూర్ణామార్కెట్‌లో నాటుకోళ్ల వ్యాపారి

పూర్ణామార్కెట్, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా నాటుకోళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. పూర్ణామార్కెట్‌లో నాటుకోళ్ల కొనుగోలు చేసేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. శని, ఆదివారాల్లో నాటు కోళ్ల అమ్మకాలు భారీగా సాగాయి. దసరా రోజు పొట్టేళ్ల ధరలు పోటీపడ్డాయి. పుంజులు కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు అమ్మారు. కోడి పెట్టలకు గిరాకీ పెరగడంతో కేజీ రూ. 800 నుంచి రూ.1000 వరకు పెంచేశారు. దసరా పండుగను ఇంటిల్లిపాది సందడిగా, సంతోషంగా జరుపుకొనేందుకు ఇష్టపడతారు. ఆహారంలో అత్యధిక శాతం మంది మాంసాహారాన్ని ఇష్టపడతారు. పూర్ణామార్కెట్‌లో కోళ్ల వ్యాపారులు భారీగా ధరలు పెంచి అమ్మడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. నాటుకోళ్ల పేరుతో గిరిరాజా కోళ్లను అంటగట్టడంతో కొనుగోలుదారులు జాగ్రత్తపడ్డారు. కోళ్ల వ్యాపారులు నాటుకోళ్లలో నిక్కచ్చి అయినవి అంటూ వారు చెప్పిన ధరకే విక్రయాలు జరిపారు. పుంజులు దొరక్క తప్పని పరిస్థితిలో కోడిపెట్టలను కొనుగోలు చేశారు. దసరా పండుగ నాటుకోళ్ల వ్యాపారులకు భారీగా లాభాలు తెచ్చిపెట్టింది.

వైసీపీ సేవలోనే జీవీఎంసీ ఇంజనీర్లు

... 5వ పేజీ తరువాయి

ఆర్‌అండ్‌డీ యార్డుకు కొట్టుకువస్తాయి. ఇవి నేరుగా సముద్రంలో కలిసిపోకుండా గ్రిల్స్ ఏర్పాటుచేశారు. వీటి వద్ద వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడతాయి. ఓ గంట మురుగునీరు నిలిచిపోతే ఎర్రిగెడ్డ పొడుగునా పారిశుధ్య సమస్య తలెత్తుతుంది. దీంతో ఆర్‌అండ్‌డీ యార్డు వద్ద నిత్యం జేసీబీలతో పూడికతీసి, టిప్పర్లలోకి లోడ్‌చేసి తరలిస్తుంటారు. ఈ పనుల కోసం ఏడాదిపాటు గెడ్డలో పూడిక, వ్యర్థాలు తీసేందుకు జీవీఎంసీ అధికారులు టెండర్ పిలుస్తుంటారు.

కీలక నేత బంధువనే...

జీవీఎంసీకి 2021లో ఎన్నికలు జరగ్గా వైసీపీ మెజారిటీ వార్డులను దక్కించుకుంది. దీంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లే మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నికయ్యారు. వీరిలో ఒకనేత బంధువు తన భార్యపేరుతో జీవీఎంసీ కాంట్రాక్టర్‌గా రిజిస్టరై ఉండడంతో ఎర్రిగెడ్డలో పూడిక, వ్యర్థాలు తీసే కాంట్రాక్టుపై కన్నేశాడు. పాలకవర్గంలో కీలకపదవిలో ఉన్న తన బంధువు అండతో అధికారులపై ఒత్తిడిచేసి ఎర్రిగెడ్డ నిర్వహణ టెండర్ తనకే దక్కేలా పావులు కదపాడు. అధికారులు దీనికి సహకరించడం, పోటీగా ఎవరైనా టెండర్ వేస్తే ఇబ్బందులు తప్పవనే భయం సృష్టించారు. దీంతో మూడేళ్లుగా అదే కాంట్రాక్టర్ పనులు దక్కించుకుంటున్నాడు. తాజాగా ఎర్రిగెడ్డలో ఏడునెలలపాటు పూడిక, వ్యర్థాలను తీసేందుకు రూ.80.33 లక్షలతో జీవీఎంసీ అధికారులు ఈ నెల 7న షార్ట్‌టెండర్ పిలిచారు.

అడ్డగోలు నిబంధనలు

నగర పరిధిలోని గెడ్డల్లో పూడికతీతకు జీవీఎంసీ ఏటా రూ.8 కోట్ల వరకూ ఖర్చు చేస్తుంది. ఒక్కో స్ట్రెచ్‌ను ఒక వర్కుగా తీసుకుని రూ.3 లక్షల నుంచి రూ.90 లక్షల పనులకు టెండర్లు పిలుస్తుంది. ఒక్కో కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటయ్యే మొత్తానికి బిడ్ వేసి పని దక్కించుకుంటారు. అద్దెకు జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు తెచ్చుకుని ఎప్పటికప్పుడు పనులు పూర్తిచేస్తారు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఈ పనులు దక్కించుకునేందుకు ఇతర కాంట్రాక్టర్లు పోటీపడతారని గుర్తించిన ప్రస్తుత కాంట్రాక్టర్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడిచేసి, అర్హత పేరుతో అడ్డగోలు నిబంధనలు తెరపైకి తెచ్చారు. వీటిలో ముఖ్యంగా టెండర్‌లో పాల్గొనే కాంట్రాక్టర్ గతంలో కనీసం రూ.68.88 లక్షల విలువైన అదేతరహా పని చేసి ఉండాలని, ఈఎక్స్-70 ఎక్స్‌కవేటర్‌ను కనీసం 1,095 గంటలు వినియోగించి ఉండాలని, ఐదు టన్నుల టిప్పర్లు కనీసం 3,389 గంటలు సొంతంగా లేదా అద్దె ప్రాతిపదికనైనా వినియోగించాలనే నిబంధన విధించారు. దీనివల్ల వైసీపీ నేత బంధువు మాత్రమే టెండర్ దాఖలుకు అర్హుడుగా మిగిలేలా అధికారులు ఎత్తులు వేశారు. తాము కూడా టెండర్‌లో పాల్గొన్నామని, అధికారులు అడిగిన అర్హతలు లేకపోవడంతో అనర్హులుగా ప్రకటించారని ఇతర కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వైసీపీ నేత బంధువుకే పనులు అప్పగించేలా రంగం సిద్ధం చేశారని ఆరోపిస్తున్నారు. గతంలో లేని అర్హత నిబంధనలు ఎందుకు పెట్టారని అధికారులను ప్రశ్నించడంతో పాటు, న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నామని చెబుతున్నారు.

సనాతన మార్గమే దిక్సూచి

అక్కయ్యపాలెం, అక్టోబరు 13: భారతీయ సంస్కృతి పరిరక్షణకు సనాతన సంప్రదాయాన్ని పాటించడమే ముఖ్యమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేఎస్ శాస్త్రి అన్నారు. అక్కయ్యపాలెంలోని మాస్టర్ హోమియో వైద్యశాలలో పది రోజులుగా జరుగుతున్న దుర్గ పూజల ముగింపు ఉత్సవంలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య వద్ద పొందిన ప్రేరణతో వేద సూక్తులు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా మాస్టర్ హోమియో వైద్యశాలలో శరన్నవరాత్రులు, వసంత నవరాత్రుల పూజలు, రుద్రాభిషేకాలను నిర్వహించామన్నారు. ఉచిత హోమియో వైద్యంతో పాటు అన్న, వస్త్రదానాలు కూడా చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 120 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్ శాస్త్రిని సత్యదేవ్, హోమియో సేవకులు మద్దూరి హనుమంతరావు, సీహెచ్ నరసింహమూర్తి, కె.శ్రీనివాస్‌లు ఘనంగా సత్కరించారు.



కేఎస్ శాస్త్రిని సత్కరిస్తున్న హోమియో సేవకులు

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్

జ్ఞానాపురం, అక్టోబరు13: జీవీఎంసీ 41వ వార్డులో పారిశుధ్య సేవలు అందిస్తున్న మహిళా కార్మికులకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్‌లు సొంత నిధులతో ఆదివారం జ్ఞానాపురంలోని కార్యాలయంలో చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఏ పండుగ వచ్చినా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటున్నామంటే చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్మికుల సేవలు అమోఘమని వారు అన్నారు. 34వ వార్డులో జనసేన అధ్యక్షుడు నీలం రాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు, శీతలపానీయాలు అందజేశారు. ఈ సందర్భంగా కొంత మంది పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తెలుగు అర్జున్, నారా నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం జనరంజక పాలన'

డాబాగార్డెన్స్, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం జనరంజకంగా పరిపాలన సాగిస్తోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వైసీపీకి బై బై చెప్పడంతో శారదా పీఠానికి నిధుల ప్రవాహం ఆగిపోయిందని వ్యాఖ్యానించారు. పెందుర్తి సమీపంలోని చిన్నముషిడివాడలో ఉన్న శారదాపీఠం అక్రమాలపై అధికారులు ఇంకా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కొందరు అధికారుల వైఖరిని చూస్తే వైసీపీ ప్రభుత్వం కొనసాగుతుందా? అనే అనుమానం రేకెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు గడిచినప్పటికీ ఇంకా అక్కడక్కడ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ పుప్పూర్ నికుంజ్, కోరుకొండ శ్రీనివాసరావు, జి.విజయరమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విజయాల కరపత్రాన్ని చూపుతున్న బి.వి.రామ్ తదితరులు



విజేతలతో తరుణ్‌యాదవ్ (మధ్యలో ఉన్న బాలుడు)

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎండాడ బాలుడి ఎంపిక

ఎండాడ, అక్టోబరు 13 : గొల్లల ఎండాడకు చెందిన బాలుడు ఒమ్మి తరుణ్ యాదవ్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నగరంలో జరిగిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో తరుణ్ యాదవ్ ఐదు నుంచి ఏడేళ్ల విభాగంలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. పోటీల్లో 10 పాయింట్లు సాధించ డంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గతంలోనూ పలు పోటీల్లో బంగారు, రజత పతకాలు గెలు పొందాడు. బాలుడ్ని కోచ్ కృష్ణకుమార్, టీడీపీ నాయకుడు చెట్టుపల్లి గోపి, తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూ రావు తదితరులు అభినందించారు.

సాయినాథుడికి పూజలు



మధురవాడ,అక్టోబరు 13 : రేవళ్ళపాలెంలోని సద్గురు సాయినాథ్ ఆలయంలో బాబాకు ఆదివారం ప్రత్యేక పూ జలు, అభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా సమాధిలోకి వెళ్లి 106 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ ధర్మకర్త దొర బాబు దంపతులు, అరవింద్ దంపతులు ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సుందరంగా అలంకరించారు.

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు

ఆరిలోవ,అక్టోబరు 13 : ఆరిలోవలోని పలు ప్రాంతా ల్లో కొన్ని నెలలుగా వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. దీంతో చీకటిపడిన తరువాత ఇళ్ల నుంచి బయటకు రావడా నికి మహిళలు, వృద్ధులు, పిల్లలు భయపడుతున్నారు. లైట్లు లేకపోవడంతో వీధి కుక్కలు వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా సాలిపేట కొండవాలు ప్రాం తంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి లైట్లు బాగుచేయడంతో పాటు కుక్కల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి 'పల్లె పండగ'

పద్మనాభం (రూరల్), అక్టోబరు 13 : రాష్ట్ర ప్రభు త్వం మండలంలో సోమవారం నిర్వహించే పల్లె పండగ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

'ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి'

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 13 : ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా నాటాలని కృష్ణా యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ డాక్టర్ సుంకరి రామకృష్ణారావు కోరారు.ఎంవీపీ కాలనీ, సీతమ్మధారలోని జీవీఎంసీ పార్కుల్లో ఆదివారం మొక్కలు నాటిన ఆయన జమ్మి చెట్టును నాటడం వల్ల కలిగే ప్రయో జనాల గురించి వివరించారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49,టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చి మిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకా యలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 26, క్యారెట్ 42 దొండ కాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచి క్కుడు 36, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరి కాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తి మీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర 5, పాల కూర, 5, తోటకూర 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	122
ఫారం ధర	--	142
విత్ స్కిన్	--	254
స్కిన్‌లెస్	--	264

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఉత్సవంలో భాగంగా కోలాటం ప్రదర్శన

డిసెంబరు 1న భీమిలి ఉత్సవ్

- ఏటా నియోజకవర్గ స్థాయిలో కోలాటం పోటీలు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, అక్టోబరు 13 : భీమిలి ఉత్సవ్ ను డిసెంబరు 1న నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీలు ఫైనల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంటాతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజర య్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భీమిలి ఉత్సవ్ జరుపుతామన్నారు. గతంలో నిర్వహించిన విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌ను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఇకపై ఏటా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయలను ప్రతిబింబించేలా కోలా టం పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయా లకు అతీతంగా నిర్వహించిన ఈ పోటీల్లో భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి 60 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమి లిలో నిర్వహించిన కోలాటం పోటీలు ఎంతగానో ఆక ట్టుకున్నాయని, గాజువాకలో తాను కూడా ఈ పోటీ లు జరుపుతానని చెప్పారు.

కాగా పోటీల్లో సీనియర్స్ విభాగంలో భీమిలి మం డలం చిప్పాడ, పద్మనాభం మండలం గెద్దపేట, ఆనం దపురం మండలం ముచ్చర్ల., జూనియర్స్ విభాగంలో పద్మనాభం మండలం పాండ్రంగి, భీమిలి మండలం యాతకుమ్మరిపాలెం, ఆనందపురం మండలం చందక బృందాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలు పొందాయి. విజేతలకు గంటా, పల్లా శ్రీనివాసరావు ట్రోఫీలతో పాటు రూ.50,000, రూ.25,116, రూ.15,116 నగదు బహుమతులు అందజేశారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి బృందానికి రూ.10,116 కన్సోలేషన్ బహుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో కె. సంగీత్ మాథుర్, టీడీపీ నాయకుడు గంటా రవి తేజ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు దంతులూరి అప్పల నర సింహరాజు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కార్పొ రేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, జనసేన, బీజేపీ నియో జకవర్గ నాయకులు పంచకర్ల సందీప్, కంటుభక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన రుషికొండ బీచ్

సాగర్‌నగర్, అక్టోబరు 13 : రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. దసరా సెలవులు కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో నగరానికి విహార యాత్రకు తరలవచ్చారు. దీంతో సాధారణ రోజుల కంటే బీచ్‌లు మరింత రద్దీగా మారాయి. ఏటా మూడు నెలలు పాటు బెంగాళ్ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పర్యాట కులు విశాఖ వస్తుంటారు. ఈఏడాది ఈతాకిడి మరీ ఎక్కు వగా వుంది. తీర ప్రాంతాలు ఎటుచూసినా పశ్చిమ బెంగాళ్ సందర్శకులతో సందడిగా కనిపించాయి.నగర ప్రజలు కూడా కుటుంబ సమేతంగా రావడంతో బీచ్‌లు కిటకిటలాడాయి. రుషికొండ బీచ్‌లో పార్కింగ్ ప్రాంతం వాహనా లతో నిండిపోయింది. ఇక్కడ కొందరు సందర్శ కులు బోటు షికార్ చేయగా, మరికొందరు సము ద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు.



సందర్శకులతో సందడిగా ఉన్న రుషికొండ తీరం

వివాదాలకు కేంద్రంగా దాకమర్రి టోల్ గేట్

- అవసరం లేని చోట ఏర్పాటు చేయడంతో అభ్యంతరం
- వ్యతిరేకిస్తున్న వాహనదారులు
- టోల్ ఫీజు వసూలుపై తరచూ గొడవలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 13 : తగ రపువలస నుంచి విజయనగరం వెళ్లే రహదారిలో ఇటీవల ఏర్పాటు చేసిన టోల్ గేట్ వివాదాలకు కేంద్రంగా మారింది. నిత్యం వాహనదారులు, టోల్ గేట్ సిబ్బంది మధ్య తగాదాలు చోటుచేసుకుంటుం డడం అధికారులు, పోలీసులకు తలనొప్పిగా మారింది. నాలుగు రోజుల కిందట తాము టోల్ ఫీజు చెల్లించ మంటూ కొంతమంది లారీ డ్రైవర్లు భీష్మించారు. ఇది కాస్తా కొట్లాటకు దారి తీసిన విషయం తెలిసిందే. దీనిపై భీమిలి పోలీసులు కేసు కూడా నమోదు చేశా రు. ఇలాంటి వివాదాలు తరచూ జరుగుతున్నా- కొన్ని మాత్రమే పోలీసుల వరకు వస్తున్నాయి. కొత్తగా రహ దారులను నిర్మించిన సమయంలో వాటి వ్యయం తిరిగి రాబట్టేందుకు, నిర్వహణకు చెక్ పోస్టులు, టోల్ గేట్‌లు ఏర్పాటు చేస్తుంటారు. కొత్తవలస - కోటపాడు మీదుగా రాయపూర్ రహదారి నిర్మించి విజయనగరం శివారులో జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. ఈ రహదారిలో ఇంకా వాహనాల రాకపోకలను అనుమతించలేదు. ఈరహదారికి సంబంధించిన టోల్ గేట్‌ను అధికారులు దాకమర్రి, జొన్నాడ రహదారిపై ఏర్పాటు చేసి వచ్చీ పోయే వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన రహదా రిపై తాము ప్రయాణించడం లేదని ఆ రహదారితో తమకు సంబంధం లేదని, అది ఇక్కడకు 14 కిలోమీ టర్ల దూరంలో ఉందని అందువల్ల తాము టోల్ ఫీజు చెల్లించమని చాలామంది డ్రైవర్లు మొండికేస్తున్నారు. ఈ కారణంతోనే తరచూ గొడవలు జరుగుతున్నాయి. విజయనగరానికి 14 కిలోమీటర్ల దూరంలో కొత్త రహ దారి లేని ప్రాంతంలో దాకమర్రి వద్ద ఎందుకు టోల్ గేట్ ఏర్పాటు చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రధాన రహదారి జాతీయ రహదారి కాదు. ప్రస్తుతం సింగిల్ రహదారి. ఇటువంటి మార్గంలో వాహనాలకు కూడా పన్ను చెల్లించాలని టోల్ గేట్ ఏర్పాటు చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఈ రహదారిలో ప్రయా ణించే వారు తరచూ టోల్ గేట్ సిబ్బందితో వాదనలకు దిగుతుండడంతో ప్రయాణా లకు అంతరాయం నెలకొంటోం ది. కేవలం సింగిల్ లైను రహ దారిగా ఉన్న ఈ రోడ్డులో టోల్ గేట్ ఉన్న ప్రాంతంలో మాత్రం రహదారిని వెడల్పు చేసి వాహ నాలను అడ్డగించడానికి వీలుగా స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని టోల్ గేట్ సిబ్బంది వద్ద ప్రస్తావించగా, ఏజెన్సీ నుంచి విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాలను కలుపుతూ కొత్తగా రాయపూర్ రహదారి నిర్మాణం చేపడుతున్నందున టోల్ గేట్ ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు. రహదారి పూర్త యిన తర్వాత అక్కడికి టోల్ గేట్ తరలిస్తామని అంటున్నారు. భీమిలి సీఐ సుధాకర్ మాట్లాడుతూ టోల్ గేట్ వద్ద గొడవలు జరగకుండా సిబ్బందికి కౌన్సెలింగ్ చేశామన్నారు. టోల్ వసూలు చేసే సమ యంలో ఎవరైనా వ్యతిరేకిస్తే వారికి పరిస్థితిని వివ రించి ఒప్పించాలని గొడవలకు దిగరాదని చెప్పా మన్నారు.



జొన్నాడ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన టోల్ గేట్



ఎండాడలో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దుర్గాదేవి



జిమ్‌సర్‌లో కాళికాదేవిగా పూజలందుకున్న రాజరాజేశ్వరి



అనంతుని ఉత్సవ విగ్రహాలకు పూజ చేస్తున్న వేద పండితులు



చిప్పాడలో గాజులతో అమ్మవారి అలంకరణ

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ఎండాడ, అక్టోబరు 13 : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న దుర్గాదేవి ఆలయంలో జరిగిన శర న్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. రాజ రాజేశ్వరి అలంకరణలో అమ్మవారు పూజలందుకు న్నారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో మహిళల తో కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు. అలాగే జిమ్‌సర్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీ ఆలయంలో కాళికాదేవి అలంకర ణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పండ్లు, స్వీట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు.

పద్మనాభం (రూరల్) : మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం లో ముగిసాయి. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి ప్రతిమలను ఊరేగించి, సమీపంలోని చెరువులు, గోస్తనీ నదిలో నిమజ్జనం చేశారు. మద్దిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాం బాబు. తులసి లక్ష్మీ దంపతులు, శ్రీనివాసరావు,గౌతం, సన్నిబాబు, కంటుబోతు గోవింద్, పుష్ప పాల్గొన్నారు.

అనంతుని క్షేత్రంలో శమీ పూజ

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనా భుని క్షేత్రంలో విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి శమీ పూజ వైభవంగా నిర్వహించారు. స్థానిక కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో అర్చకులు పి. సీతారామాంజనేయస్వామి, వెంకటాచార్యులు, పవన్ ముందుగా ఉభయ దేవేరులతో కూడిన అనం తుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక మండపంపై నిలిపి విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నెలకొల్పిన జమ్మి చెట్టు వద్ద శమీ పూజ నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులు జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా గెద్దపేట, విజయానందపురం జం క్షన్, తదితర చోట్ల అమ్మవారి ప్రతిమలను భారీ ఊరే గింపుల నడమ నిమజ్జనం చేశారు. గెద్దపేట సుబ్ర హ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం నుంచి కోలాటం బృందాలతో 108 మంది మహిళలు కలశలతో అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు. అనంతరం ఆలయ ట్రస్టీ ఎన్. పూర్ణచంద్రరావు ఆధ్వ ర్యంలో అమ్మవారి నిమజ్జనం జరిపారు.

భీమునిపట్నం : పట్టణవాసులు విజయదశమిని ఘనంగా జరిపారు. కనకదుర్గ ఆలయం, కాత్యాయిని ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, కల్యాణ వేంకటేశ్వర ఆలయాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరాలయంలో పద్మావ తి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు.

మధురవాడ : టైలర్స్ కాలనీలోని విజయదుర్గ ఆలయంలో వసంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వ హించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభి షేకాలు, సహస్ర కుంకుమార్చన జరిపారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతులు, ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మ, కమిటీ సభ్యులు బంగారు అశోక్, రూప్సీ ప్రకాశ్, మాధవి పాల్గొన్నారు.





పద్మనాభంలో శమీ పూజ, గెద్దపేటలో కలశాలతో అమ్మవారి ఊరేగింపు



తగరపువలస బైపాస్ కూడలిలో అండర్‌పాత్ వంతెన

ప్రమాదకరంగా అండర్ పాత్ వంతెన

తగరపువలస, అక్టోబరు 13 : తగరపువలస బైపాస్ రోడ్డులో అండర్ పాత్ వంతెన వద్ద ప్రమాదకర పరిస్థి తులు నెలకొన్నాయి. వంతెన కింద నుంచి నాలుగు ప్రాంతాల్లోని వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయి. వంతెన నుంచి ఒక సర్వీసు రోడ్డులోకి ప్రవేశించడానికి మరో సర్వీసురోడ్డు నుంచి వాహనాలు రావడానికి అవకాశం ఉంది. అలాగే తగరపువలస నుంచి విజయనగరం రహదారి నుంచి నేరుగా వాహనాలు కలుస్తుంటాయి. భీమిలి నుంచి నేరుగా వచ్చే వాహనాలు కూడా వంతెన వద్దే కలుస్తుంటాయి. వీటికితోడు కొందరు వంతెన కింద వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వంతెన ఆవతల వైపు రెండు కళాశాలలు, ఇవతల వైపు రెండు కళాశాలలు ఉండడం వల్ల నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వాహనాల నియంత్రణకు ఇక్కడ ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు చుట్టూ తుప్పలు

పద్మనాభం (రూరల్), అక్టోబరు 13 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తం భాల చుట్టూ తుప్పలు, ముళ్ల కంపలు పేరుకుపోయాయి.కొన్నిచోట్ల పాదులు గుబురుగా పాకాయి. దీనివల్ల సాంకే తిక సమస్యలు తలెత్తినప్పుడు మర మ్మతులు చేపట్టడం సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటుంది. ముఖ్యంగా అనంతవరం, పెంట, గొల్లలపాలెం, తునిపోలం, బాందేవుపురం, అచ్చుకు నిపాలెం, సుంకరపెట, నరసాపురం, బుడ్డివలస. కొయ్యాపేట గ్రామాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గర అయితే మరింత దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.ఈవిషయమై స్థానికులు ఎప్పటికప్పుడు ఆ శాఖాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెంటలో తుప్పల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో దీపోత్సవం



ఆలయంలో చేపట్టిన దీపోత్సవం

ఆరిలోవ, అక్టోబరు 13 : చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో దసరా పురస్కరించుకుని శనివారం సాయంత్రం దీపోత్సవం ఘనంగా నిర్వహిం చారు. మహిళలు సుమారు 18 వేల దీపాలను వెలగించారు. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ ప్రారంభించారు. తొలుత సాయిబాబాకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం దీపోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు వానపల్లి అప్పారావు, ఆర్‌ఎస్ విన్నీ పాత్రో, ఆర్‌పి పాత్రో, వానపల్లి మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, అక్టోబరు 13 : విశాఖ జోన్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమ, మంగళవారం భీమిలి పాలిటెక్నిక్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల సర ఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సకరయ్య తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. నేరెళ్లవలస, ఎగువపేట, బోయవీధి, ఎస్‌వీఎస్, జీవీఎంసీ జోనల్ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

గీతం దూర విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాగర్‌నగర్, అక్టోబరు 13 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఏ ఇంగ్లీష్, బీఏ, బీకామ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీఓఈ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటి దగ్గర నుంచి ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాట్లు చేశా మన్నారు. వచ్చేనెల 15వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని, పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

ఘనంగా నృత్యోత్సవం



కళాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, అక్టోబరు 13 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో వెంపటి చిన్న సత్యం జయంతి నృత్యోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారం భమయ్యాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్రం సం యుక్తంగా నిర్వహించిన నృత్యోత్సవాల్లో కూచిపూడి కళాకారిణుల నృత్యాలు ఆకట్టు కున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగార్జున వర్సిటీ మాజీ కులపతి బాల మోహన్‌దాస్, డాక్టర్ శ్రీధర్ బిట్రా, ఎం ఎస్ శ్రీనివాస్ కళాకారిణులకు బహుమతు లు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూచిపూడి నృత్యానికే వెంప టి చిన్న సత్యం ఆభరణం వంటివారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి నరవ ప్రకాశ్‌రావు, వైద్యులు పసుమర్తి వెంకటర మణ, సందీప్‌కుమార్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకట రమణారావు, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ రామమూర్తి, తదిత రులు పాల్గొన్నారు.

రామాయణ పారాయణం సమాప్తం

సింహాచలం, అక్టోబరు 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిర్వ హిస్తున్న వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి చేపట్టిన రామాయణ పారాయణం ఆదివారం నాటి పట్టాభిషేక సర్గ విన్నపంతో పరిసమాప్తమైంది. గత పది రోజుల్లో ప్రతిరోజూ ఉదయం ఆలయ బేడా మండపంలోని హంసమూలన అధ్యాపకుడు టిపి రాజేశ్ వాల్మీక విరచిత రామాయణ మహాకావ్యాన్ని పఠించారు. ఆఖరిరోజు మధ్యాహ్నం స్వామివారి రాజభోగ నివేదన సమయంలో రామా పట్టాభి షేక సర్గ విన్నపం జరిపారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు డా.టిపి రాజగో పాల్ అధ్యాపకుడ్ని ఘనంగా సత్కరించారు.